సాక్షి తిరుపతి

సోమవారం। 26। జూన్। 2023



చుక్కల భూమి.. చక్కని పరిష్కారం

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బ్రిటీష్‌కాలం నుంచి ఉన్న చుక్కల భూముల సమస్యలకు ఒక్క సంతకంతో కు పరిష్కారం చూపారు. – 8లో



అలరించిన దుర్యోధన వధ

రామాపురంలో జరుగుతున్న మహాభారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన దుర్యోధన వధ అలరించింది. – 8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	37	26
చిత్తూరు	36	26
తిరుమల	32	22
గూడూరు	38	28
నగరి	37	26

న్యూస్‌రీల్

29న కోనలో తొలి ఏకాదశివేడుకలు



పాలసముద్రంలో ఉన్న లక్ష్మీనరసింహస్వామి(ఫైల్)

రాపూరు: మండలంలోని పెంచలకోనలో ఈ నెల 29వ తేదీన తొలి ఏకాదశి వేడకలను నిర్వహించనున్నట్లు ఆలయాధికారులు తెలిపారు. తొలి ఏకాదశి రోజున శ్రీమన్నారాయునుడు యోగనిద్రకు ఉపక్రమించారని, అందుకు పెనుశిల లక్ష్మీనరసింహస్వామి అంతరాలయంలో స్వామివారి ఉత్సవమూర్తిని పాల సముద్రంలో యోగనిద్రలో ఉన్నట్లుగా శ్రీవారిని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ప్రతి నెలా చివరి మంగళవారం డయల్ యువర్ స్విమ్స్

తిరుపతి తుడా: రోగుల సాధక బాధలు తెలుసుకుని మరిన్ని వైద్య సదుపాయాలను కల్పించేందుకు ఇకపై ప్రతి నెలా చివరి మంగళవారం డయల్ యువర్ సిమ్స్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 27వ తేదీ(మంగళవారం) ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు చెప్పారు. సలహాలు సూచనలు అభిప్రాయాలు చెప్పదలచిన వారు 0877-2246188 నంబరుకు కాల్ చేయవచ్చన్నారు ఉదయం 9.30 నుంచి 10.30 గంటల మధ్య డయల్ యువర్ స్విమ్స్ కార్యక్రమం జరుగుతుందన్నారు. మెరుగైన సౌకర్యాలు, నాణ్యమైన వైద్యాన్ని అందించేందుకు డయల్ యువర్ స్విమ్స్ ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. క్షేత్రస్థాయిలో రోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు ఇంకా ఏవైనా మెరుగైన వసతులు, సౌకర్యాలు కావాలన్న వాటిపై కాల్ చేసి, తెలపవచ్చన్నారు.

కలెక్టరేట్‌లో నేడు స్పందన

తిరుపతి అర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం స్పందన కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి ఆదివార ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10.30 నుంచి 1.30 గంటల వరకు కొనసాగుతుందన్నారు. అర్జీదారుల సౌకర్యార్థం అర్జీలను రాయడానికి ప్రత్యేకంగా ముగ్గురు వీఆర్వోలను ఏర్పాటు చేశామని తెలిపారు. స్పందనకు వచ్చే అర్జీదారులకు అవసరం అయిన అన్ని ఏర్పాట్లు చేపట్టామన్నారు. మీ సమస్యలను నేరుగా జిల్లా అధికారులు, డీఆర్వో, జాయింట్ కలెక్టర్, కలెక్టర్‌కు తెలియజేడానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. మరోవైపు స్పందనకు ప్రతి విభాగానికి చెందిన జిల్లాధికారులు హాజరుకావాలని స్పష్టం చేశారు. స్పందనలో వచ్చే అర్జీలకు అక్కడికక్కడే పరిష్కారం చూపాలని స్పష్టం చేశారు.

వైభవంగా బకాసుర వధ



పురవీధుల్లో ఊరేగుతున్న భీమసేనుడు

శ్రీకాళహస్తి: మహాభారత యజ్ఞంలో భాగంగా ఆదివారం బకాసుర వధఘట్టం వైభవంగా నిర్వహించారు. ముక్కంటీశ్వరాలయానికి అనుబంధంగా చెన్నైరోడ్డులో ఉన్న ద్రౌపదీ సమేత ధర్మరాజులస్వామి ఆలయంలో మహాభారతయజ్ఞం ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం హిడింబాసుర, బకాసుర వధ ఘట్టం నిర్వహించారు. అనంతరం రాత్రి భీమసేన ఉత్సవమూర్తికి విశేషాలంకరణ చేసి పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు పెద్దసంఖ్యలో భీమసేనుని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు.

గౌరవంగా వ్యవహరించండి

తిరుపతి అర్బన్: ప్రయాణికులతో గౌరవంగా వ్యవహరించాలని జిల్లా ప్రజా రవాణా అధికారి చెంగల్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు టికెట్‌కు సరి పడే చిల్లర ఇవ్వడం లేదని కండక్టర్లు దురుసుగా వ్యవహరించడం, రిక్వెస్ట్ స్టాపింగ్‌లో నిలపడంలేదని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. రిక్వెస్ట్ స్టాపింగ్ విషయంలో డ్రైవర్లు ప్రయాణికులతో సహకరించాల్సి ఉందన్నారు. వారి అవసరం ఆధారంగా రిక్వెస్ట్ స్టాపింగ్ కోరుతుంటారని వెల్లడించారు. పరిస్థితులను అర్థం చేసుకోవాల్సి ఉందన్నారు. అలాగే ప్రయాణికులు టికెట్‌కు సరిపోయే చిల్లర తెచ్చుకోవాల్సి ఉందన్నా రు. కండక్టర్లు ప్రయాణికులతో స్నేహపూర్వకంగా ముందుకు సాగాల్సి ఉందని సూచించారు. అంతే తప్ప ప్రతి చిన్న విషయానికి పెద్ద గొడవలు చేసుకోవడం మంచి పద్ధతి కాదని హితవు పలికారు. ఆర్టీసీపై ప్రయాణికులకు గౌరవం పెరిగేలా ఉద్యోగులు నడుసుకోవాల్సి ఉంటుందన్నారు. సమన్వయంతో బాధ్యతలు నిర్వహించాల్సి ఉంటుందని చెప్పారు. అలా వ్యవహరిస్తేనే ఆర్టీసీపై గౌరవం, నమ్మకం పెరుగుతుందన్నారు.

నాడు : టీడీపీ పాలనలో మొండిగోడలు, శిథిలావస్థకు చేరిన తరగతి గదులు, ప్రహరీలు లేక పశువులు, పందులతో సహవాసం. మరుగుదొడ్లు లేక బాలికల అవస్థలు. కిచెన్ షెడ్లు లేక ఆరుబయట, వర్షంలోనే వంటలు, కొళాయిల లేక అసలు నీరే తాగకపోవడం వంటి సమస్యలతో ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులు అవస్థలు ఎదుర్కొనే వారు.

నేడు : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా భావించి అమలు చేస్తున్న నాడు–నేడు పథకంతో సర్కారు బడులు కొత్త రూపు సంతరించుకున్నాయి. ప్రభుత్వం రూ.వందల కోట్లు నాడు–నేడు పథకానికి ఖర్చు చేయడంతో సర్కారు బడులు సర్వాంగ సుందరంగా మారాయి. మౌలిక వసతులతో పాటు కార్పొరేట్ స్థాయిలో సర్కారు బడుల్లో విద్య అందుతోంది.



నాడు కుప్పం మండలంలోని పరమసముద్రం కేజీబీవీ పాఠశాల



నేడు కుప్పం మండలంలోని పరమసముద్రం కేజీబీవీ పాఠశాల

కార్పొరేట్ కళ..

సర్కారు బడి భళా

అక్షరం.. దీని శక్తి అనన్య సామాన్యం.. ఇది జీవితాన్ని మార్చేస్తుందని గ్రహించారు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి. నిరుపేద చిన్నారుల జీవితాల్లో వెలుగులు నింపాలని నిర్ణయించారాయన. అందుకే ప్రభుత్వ విద్యను బలోపేతం చేసే దిశగా విద్యారంగంలో పలు సంస్కరణలు తీసుకొచ్చారు. ఈ క్రమంలోనే నాడు–నేడు పథకం అమలు చేసి, సర్కారు స్కూళ్లను ఆధునికీకరించారు. ఫలితంగా వాటికి కార్పొరేట్ కళ వచ్చింది. నేడు సర్కారు బడులు భళా అని పలువురు అంటున్నారు

- నాడు–నేడుతో సకల హంగులు
- సర్వాంగ సుందరంగా సర్కారు బడులు
- బలోపేతమైన విద్యారంగం

చిత్తూరు కలెక్టరేట్ : టీడీపీ హయాంలో సర్కారు బడులను ఏమాత్రం పట్టించుకోని దుస్థితి. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దులో ఉన్న చిత్తూరు, తిరుపతి జిల్లాలకు దేశవ్యాప్తంగా ఎంతో గొప్ప పేరుంది. చంద్రబాబునాయుడు పరిపాలనలో ఆయన ప్రాతినిధ్యం వహించే కుప్పానికి గానీ, సొంత నియోజకవర్గం చంద్రగిరిలో గానీ విద్యాభివృద్ధికి చేసిందేమీ లేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విద్యాభివృద్ధికి చర్యలు చేపడుతోంది. గతంలో ఓ కార్పొరేట్ విద్యాసంస్థ అధినేతను పక్కన పెట్టుకుని ఆ విద్యాసంస్థలకు రెడ్‌కార్పెట్ వేసిన ఘనత చంద్రబాబునాయుడుకు దక్కింది. వైఎస్సార్ సీపీ పరిపాలనలో స్వయంగా సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి విద్యావ్యవస్థ అభివృద్ధికి, ప్రభుత్వ విద్యాసంస్థల బలోపేతానికి కృషి చేస్తున్నారని విద్యావేత్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఏటా విద్యాభివృద్ధికి రూ.వేల కోట్లను ప్రభుత్వం ఖర్చు పెడుతోంది. గతంలో ఎన్నడూ చూడని రీతిలో ప్రభుత్వ పాఠశాలల్లో వైఎస్సార్ సీపీ పాలనలో సర్వాంగసుందరంగా తయారయ్యాయి.

గతంలో వాగ్దానాలు మాత్రమే..

ఎన్నికల సమయంలో విద్యాభివృద్ధికి అనేక వాగ్దానాలు ఇచ్చిన టీడీపీ ఆ తర్వాత వాటిని పూర్తిగా తుంగలో తొక్కింది. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నాం, అన్ని పాఠశాలలకు మౌలిక వసతులు కల్పిస్తున్నామని చంద్రబాబు గొప్పలు చెప్పేవారు. అయితే అవన్నీ క్షేత్రస్థాయిలో ఏమాత్రం కనిపించని పరిస్థితి. గత పాలనలో సర్కారు బడులను ఏ మాత్రం పట్టించుకోకపోవడంతో అనేక సమస్యలు కొట్టుమిట్టాడేవి. రేషనలైజేషన్ పేరుతో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 869 ప్రభుత్వ పాఠశాలలను మూసివేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలల దుస్థితి చూస్తే మేడిపండు చందంగా ఉందనే విమర్శలు టీడీపీ పాలనలో ఉండేవి.

నాడు–నేడు అమలు తీరు ఇలా....

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 4,816 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. ఆ బడుల్లో 3,30,565 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ప్రభుత్వం నాడు–నేడు పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తోంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మొదటి విడతలో 1,533 పాఠశాలల్లో వసతుల కల్పనకు ప్రభుత్వం రూ.354 కోట్లను ఖర్చు చేసింది. తద్వారా ఆ బడులన్నీ కార్పొరేట్‌కు ధీటుగా తయారయ్యాయి. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో నాడు–నేడు రెండో విడత పనులు శరవేగంగా సాగుతున్నా యి. ఆ పనులను ఉన్నతాధికారులు నిత్యం పర్యవేక్షిస్తున్నారు. రెండో విడతలో చిత్తూరు జిల్లాలోని 7 నియోజకవర్గాల్లో ఎంపిక చేసిన 1,113 పాఠశాలల్లో పనులు చేస్తున్నారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు రూ.129.84 కోట్లను వ్యయం చేసింది. తి రుపతి జిల్లాలో రెండో విడతలో ఈ పథకానికి 982 పాఠశాలలను ఎంపిక చేసి, పనులు చేపడుతున్నారు.

బడుల్లో నాడు–నేడు సౌకర్యాలిలా..

మొదటిదశ నాడు–నేడు పథకంలో ప్రభుత్వం సర్కారు బడుల్లో అనేక సౌకర్యాలను కల్పించింది. రెండో దశలో కాంపొనెంట్‌ల వారీగా అనేక సౌకర్యాల కల్పనకు చర్యలు చేపడుతున్నారు.

- నిరంతరం నీటి సరఫరాతో మరుగుదొడ్లు
- ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్‌లతో కూడిన విద్యుద్ధీకరణ
- శుద్ధి చేసిన తాగునీటి సౌకర్యం
- పిల్లలు,టీచర్లు, తరగతి గదులకు ఫర్నిచర్ ఏర్పాటు
- రంగులు వేయుట, మేజర్, మైనర్ మరమత్తులు
- గ్రీన్ గ్లోస్సీ చాక్‌బోర్డులు, ఇంగ్లిష్ ల్యాబ్‌లు ఏర్పాటు
- ప్రహరీ గోడలు, వంట గదుల నిర్మాణం, మరమ్మతులు, తరగతి గదుల నిర్మాణం తదితర సౌకర్యాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తోంది.



చిత్తూరు ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన బెంచీలు

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నాడు–నేడు సమాచారం

చిత్తూరు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు	2,478
చదువుతున్న విద్యార్థులు	1,63,901
తిరుపతి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు	2,338
చదువుతున్న విద్యార్థులు	1,66,664
ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మొదటిదశలో పనులు పూర్తి చేసిన పాఠశాలలు	1,533
చిత్తూరు జిల్లాలో రెండో విడతలో పనులు చేస్తున్న పాఠశాలలు	1,183
తిరుపతి జిల్లాలో రెండో విడత నాడు పనులు చేస్తున్న పాఠశాలలు	982

నిత్యం పర్యవేక్షణ



జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న నాడు–నేడు పనుల పురోగతిని నిత్యం పర్యవేక్షిస్తున్నాం. క్షేత్రస్థాయిలో ఇటీవల పలు పాఠశాలలను సందర్శించాను. ప్రభుత్వం నాడు–నేడు పనులను ప్రతిష్టాత్మకంగా భావిస్తోంది. ఈ నేపథ్యంలో పనుల పురోగతిలో వెనుకబడిన చోట్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టి పురోగతి సాధించాలని ఆదేశించాం. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పనులను పూర్తి చేయాలి. పలు చోట్ల అధికారులు అలసత్వం వీడి పనులను పకడ్బందీగా చేపట్టాలి. ఎంఈఓలు నిత్యం నాడు–నేడు పనులను పర్యవేక్షించాలి.

– షణ్మోహన్, కలెక్టర్

నాణ్యతగా నాడు–నేడు పనులు



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నాడు–నేడు పనులను ప్రతిష్టాత్మకంగా చేపడుతోంది. నాణ్యతతో నాడు–నేడు రెండో దశ పనులు చేపట్టడం జరుగుతోంది. క్షేత్రస్థాయిలో అలసత్వం వహించే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ నాడు–నేడు పనులు పూర్తి చేసేలా పకడ్బందీగా చర్యలు చేపడుతున్నాం.

– వెంకటరమణారెడ్డి,ఏపీసీ, సమగ్రశిక్ష

గంగమ్మ ఆలయ రెండో విడత పనులకు శ్రీకారం



విశేషాలంకరణలో గంగమ్మ



ఆలయ నిర్మాణ పనులకు పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి కల్చరల్: తాతయ్యగుంట గంగమ్మ ఆలయం పునర్నిర్మాణంలో భాగంగా రెండో విడత పనులకు ఆదివారం శ్రీకారం చుట్టారు. గంగజాతర సందర్భంగా నిర్మాణ పనులను తాత్కాలికంగా నిలుపుదల చేసిన విషయం తెలిసిందే. మరుపొంగళ్లు పూర్తి కావడంతో ఆదివారం నుంచి తిరిగి పనులు ప్రారంభించారు. ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ఆలయ ప్రాంగణంలో రాతి స్తంభాలకు పూజలు చేసి పనులను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ తిరుపతి గ్రామదేవతగా, శ్రీవారి చెల్లెలుగా పూజలందుకుంటున్న తాతయ్యగుంట గంగమ్మ ఆలయ విశిష్టత భావితరాలకు అందించాలనే సంకల్పంతో సుమారు రూ.16 కోట్లతో అద్భుతంగా పునర్నిర్మాణం చేపట్టినట్టు తెలిపారు. జాతరకు ముందు గర్భాలయాన్ని పూర్తి చేశామని, ప్రస్తుతం రెండో దశ పనులు చేపట్టామన్నారు. ఆలయ రాతి స్తంభాల మండపం, రాతి ఫ్లోరింగ్ పనులు చేపట్టనున్నామని, ఇందుకోసం టీటీడీ రూ.4 కోట్లు కేటాయించినట్టు వెల్లడించారు. ఆరు, ఏడు నెలల్లో పనులు పూర్తి చేసి వచ్చే ఏడాది జాతరకు ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కట్టా గోపియాదవ్, ఈవో ఎం.మునిక్రిష్ణయ్య, సభ్యులు వెంకటేశ్వరరావు, ఎం.హరినాథ్‌రెడ్డి, టి.రమణమ్మ, పి.ధనశేఖర్, వి.క్రిష్ణమ్మ, ఎస్.భారతి, వైఎస్సార్ సీపీ నేతలురెడ్డి సిద్దారెడ్డి, ఎస్‌ఆర్‌బీ హరిప్రసాద్‌రెడ్డి, అనిల్ కుమార్ పాల్గొన్నారు.

2కే23 ఓవరాల్ చాంపియన్ ఆంధ్రప్రదేశ్ జట్టు



ఓవరాల్ చాంపియన్ షిప్ బహుమతిని అందుకుంటున్న, ఆంధ్రప్రదేశ్ జట్టు

తిరుపతి కల్చరల్: తిరుపతి వేదికగా ఈనెల 24, 25 తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహించిన 12వ జాతీయస్థాయి తోంగ్- ఇల్–మూ–డో మార్షల్ ఆర్ట్స్ 2కే23 చాంపియన్ షిప్ ఓవరాల్ చాంపియన్‌షిప్‌గా ఆంధ్రప్రదేశ్ జట్టు నిలిచింది. ద్వితీయ, తృతీయ స్థానాలను పాండిచ్చేరి, మహారాష్ట్ర కైవసం చేసుకున్నాయి. ఆదివారంతో ముగిసిన ఈ పోటీలకు వివిధ రాష్ట్రాల నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులు హాజరై పోటాపోటీగా ఆడారు. ఈ సందర్భంగా గిరిజన్ భవన్‌లో నిర్వహించిన పోటీల ముగింపు కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా స్కి అండ్ స్నోబోర్డ్ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి మహ్మద్ అర్షద్, కర్లింగ్ ఫెడరేషన్ జాతీయ కార్యదర్శి మహ్మద్ ద్యానిష్, ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ రాయలసీమ జోన్ అధ్యక్షుడు ఎస్.విశ్వనాథరెడ్డి, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ చీఫ్ కోచ్ సయ్యద్, రాష్ట్ర రోలర్ స్కి అసోసియేషన్ చైర్మన్ ఎస్.విశ్వచందన్‌రెడ్డి, రాష్ట్ర గ్రప్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.సురేంద్రరెడ్డి, ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆంజనేయులు నాయుడు, తోంగ్–ఇల్–మూ–డో ఆంధ్ర రాష్ట్ర అధ్యక్షురాలు ఇందు, ప్రధాన కార్యదర్శి మణికంఠన్, కర్ణాటక రాష్ట్రం కార్యదర్శి రజాక్ పాల్గొని వివిధ విభాగాల్లో విజేతలకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు, బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ ప్రతి ఆటలో గెలుపోటములు సర్వసాధారణమన్నారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో క్రీడాపోటీల్లో పాల్గొని ఆడాలని తెలిపారు. అప్పుడే విజయం వరిస్తుందని చెప్పారు. అనంతరం క్రీడాకారులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

యువగళం..అత్యుత్సాహం!

- ఇష్టారాజ్యంగా వైఎస్సార్‌సీపీ బ్యానర్ల చించివేత
- మండిపడ్డ స్థానిక నేతలు

నాయుడుపేట: యువగళం పాదయాత్రలో తెలుగు తమ్ముళ్లు అత్యుత్సాహం ప్రదర్శించారు. తమ అధినేత నారా లోకేష్ దృష్టిలో పడేందుకు నానాయాగీ చేశారు. జనాలు కరువైనా పాదయాత్ర విజయవంతం చేసేందుకు నానాతంటాలు పడ్డారు. ఇందులో భాగంగా నాయుడపేటలో కొందరు తమ్ముళ్లు అరాచకం సృష్టించారు. గతంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ బ్యానర్లను ఇష్టారాజ్యంగా చించివేశారు. మరికొన్ని తొలగించి ఎత్తుకెళ్లారు. దీనిపై స్థానిక నాయకులు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.

అసలేం జరిగిందంటే

నాయుడుపేట గడియారం సెంటర్ వద్ద పెత్తందారులు.. పేదల మధ్య యుద్ధం అనే బ్యానర్‌ను గతంలో వైఎస్సార్‌సీపీ నేతలు ఏర్పాటు చేశారు. నారా లోకేష్ స్థానికంగా బహిరంగ సభ ఏర్పాటు చేయడంతో టీడీపీ నేతలు ఆ బ్యానర్‌ను చించివేశారు. ఆపై పక్కనే ఏర్పాటు చేసిన బ్యానర్లనూ నాశనం చేశారు. ఇదే అదునుగా పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ఉన్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య బ్యానర్లను చించివేయడమేకాకుండా అక్కడి నుంచి తొలగించే ప్రయత్నం చేశారు. తమ అధినేత దృష్టిని ఆకర్షించాలని పూనకంతో ఊగిపోయారు. అక్కడే ఉన్న ఎస్‌ఐ శ్రీకాంత్ వారిని వారించే ప్రయత్నం చేసినా వినిపించుకోలేదు.

యువగళం..నిరుత్సాహం

యువగళం పాదయాత్రకు జనాల్ని తరలించేందుకు ఆ పార్టీ నేతలు నానా తంటాలు పడ్డారు. సభకు ఎవరూ రాకపోవడంతో గ్రామాల నుంచి ఆటోల్లో తరలించాల్సి వచ్చింది. ఒక్కొక్కరికీ రూ.200 చొప్పున ఇచ్చి తరలించిన నేతలు.. అందులో కొందరికి డబ్బులివ్వకపోవడంతో మండిపడ్డారు. సంబంధిత చోటామోటా నేతలపై తిట్లదండకం అందుకోవడం కనిపించింది. దీనికితోడు జనాలను తరలించేందుకు పార్టీ ఫండ్‌గా ఒక్కో పంచాయతీకి రూ.4వేలే ఇవ్వడం.. దాన్ని స్థానిక నేతలు తిరస్కరించడం చర్చనీయాంశమైంది. యువగళం సభలో లోకేష్ మాట్లాడుతున్నా జనం నుంచి ఎలాంటి స్పందన కనిపించలేదు. దీంతో చివరిలో డీజే పాటలతో చేతులు ఊపించే ప్రయత్నం చేశారు.

రాజ్యాంగ నిర్మాతను మరిచిన లోకేష్

పట్టణంలోని గాంధీమందిరం వద్ద నారా లోకేష్ బహిరంగ సభ జరిగింది. ఆపై పది అడుగుల దూరం నడిచిన ఆయన ఎదురుగా ఉన్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని చూసి పటీపట్టనట్టు వెళ్లిపోయారు. అక్కడే ఉన్న కొందరు ఎస్సీ నాయకులు పూలమాల తెచ్చి అంబేడ్కర్ విగ్రహానికి వేయాలని సూచించినా ఆయన ఏమాత్రం పట్టించుకోలేదు. టీడీపీలో ఎస్సీలకు సముచిత స్థానం లేదనడానికి ఇదే నిదర్శనమని కొందరు నేతలు చెవులు కొరుక్కోవడం కనిపించింది.

లోకేష్‌కు రాజ్యాంగం గురించి మాట్లాడే అర్హత లేదు

అంబేడ్కర్‌ను గౌరవించలేని నారా లోకేష్‌కు ఆయన రాసిన రాజ్యాంగం గురించి మాట్లాడే అర్హతే లేదని దళిత విద్యావేత్త, దళిత సంఘాల నాయకులు పేర్నాటి సాగర్ తీవ్రంగా విమర్శించారు. దళితోద్ధారకుడినని చెప్పిన లోకేష్‌కు అంబేడ్కర్ కనిపించలేదా? అని ప్రశ్నించారు. రాజకీయాలకు మాత్రం రాజ్యాంగాన్ని, అంబేడ్కర్‌ను వాడుకుంటారా..అని నిలదీశారు. దళితులపై అంకితభావం లేని టీడీపీ నేతలు, దళితోద్ధారకులు ముసుగులు తీయాలని సూచించారు. దళితులు రానున్న ఎన్నికల్లో టీడీపీకి తగిన గుణపాఠం నేర్పుతారన్నారు.



గాంధీపార్కు సమీపంలో చించివేసిన వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీ



నాయుడుపేటలో చించివేసిన ఫ్లెక్సీ

వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీల చించివేత

నాయుడుపేటటౌన్:పట్టణంలోని గాంధీపార్కు సమీపంలో, ఆర్‌అండ్‌బీ అతిథి గృహం సమీపంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీలను శనివారం అర్ధరాత్రి టీడీపీ నేతలు కొందరు చించివేశారు. టీడీపీ నేత నారా లోకేష్ జరుపుతున్న యువగళం పాదయాత్రకు ఆ పార్టీ నాయకులు గాంధీపార్కు సెంటర్ తదితర చోట్ల టీడీపీ నేతల ఫ్లెక్సీలను ఏర్పాటు చేసుకున్నారు. గాంధీపార్కు కూడలి సమీపంలో లోకేష్ బహిరంగ సభను ఏర్పాటు చేయడంతోనే ఈ దుశ్చర్యకు పాల్పడినట్లు తెలిసింది. ఫ్లెక్సీల చించివేతపై పోలీసులకు సైతం ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

ఘనంగా మహాకుంభాభిషేకం



కలశానికి పూజలు చేస్తున్న వేదపండితులు

శ్రీకాళహస్తి: ముక్కంటీశ్వరాలయానికి అనుబంధంగా కైలాసగిరికొండల్లో ఉన్న కాలభైరవస్వామి, వీరభద్రస్వామి ఆలయాల మహాకుంభాభిషేకం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ ఆలయాలకు కుంభాభిషేకాలు నిర్వహించి 12 ఏళ్లు పైనే జరగడంతో శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు ధర్మకర్తల మండలిలో తీర్మానం చేసి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సహకారంతో సుమారు రూ.40 లక్షలు వ్యయంతో ఆలయ జీర్ణోద్ధరణ పనులు చేశారు. ఈ నేపథ్యంలో మహాకుంభాభిషేకం చేశారు. ఇందులో భాగంగా ఆలయ ప్రధాన అర్చకులు స్వామినాథన్ గురుకుల్ ఆధ్వర్యంలో వేదపండితులు కలశస్థాపన పూజలు, హోమ పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం స్వామివారికి విశేషాలంకరణ చేసి, ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. ఈ సందర్భంగా పాలకమండలి చైర్మన్ అంజూరు మాట్లాడుతూ ఈ ఆలయాలను శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చే భక్తులు దర్శించుకునేలా తీర్చిదిద్దుతామన్నా రు. ఆలయ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నూక రత్నం, పాలకమండలి సభ్యులు జయశ్యామ్, సునీత, రమాప్రభ, లక్ష్మి, ప్రత్యేక ఆహ్వానితులు శ్రీదేవి పాల్గొన్నారు.

అలరించిన భరతనాట్యం


కళాకారుల నృత్యప్రదర్శన

తిరుచానూరు(చంద్రగిరి): శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. తిరుపతికి చెందిన శ్రీపద్మ కళాక్షేత్ర ఆధ్వర్యంలో కళాకారులు భరతనాట్యం, జానపద నృత్యాలను ప్రదర్శించారు. ఇందులో భాగంగా పుష్పాంజలి, ఏకదంతాయ, ఈశ్వర, శివతాండవం, గంధం పూయరె, భరతవేదమున, జగడపు జనువుల జాజర, తెలుగుజాతి, యశోద వంటి పాటలకు కళాకారులు ధన్విత, గంగోత్రి, గీతిక, జాహ్నవి, తేజ, లతిక్ సాయి, యమున, రజిత, రాణి, రిషిత, హిమశ్రీ, హర్షిత చేసిన నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. అనంతరం కళాకారులను ఏఓ ఖాదర్‌వల్లీ సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాధాకృష్ణ, పప్పి, వరప్రసాద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

■ **నారాయణమ్మది** చిల్లకూరు మండలం నెలబల్లిరెట్టపల్లి గ్రామం. ఈమె భర్త ద్వారా 65 సెంట్ల భూమి సంక్రమించింది. అవసరాల నిమిత్తం ఆ భూమిని పలు మార్లు విక్రయించేందుకు సిద్ధపడింది. అయితే చుక్కల భూమిగా నిషేధిత జాబితాలో ఉండడంతో రిజిస్ట్రార్‌లు అనుమతులు నిరాకరిస్తూ వస్తున్నారు. దీంతో నిషేధిత జాబితా నుంచి భూమిని తొలగించాలని సుమారు 20 ఏళ్లుగా కార్యాలయం చుట్టూ తిరిగినా ఫలితం లేదు. నేడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయంతో అధికారుల నుంచి హక్కుల పత్రాలను అందుకుని సంతోషం వ్యక్తం చేసింది.



■ కోట మండలం కొత్తపాళెం నివాసి అయిన **నాసిన సుబ్బరామయ్య**కు 28 సెంట్ల భూమి తాతల కాలం నుంచి వారసత్వంగా వచ్చింది. అయితే పంట సాగు నిమిత్తం ఆ భూమిపై రుణం తీసుకునేందుకు ప్రయత్నిస్తే చుక్కల భూమిగా నమోదైనట్లు అధికారులు తెలిపారు. దీంతో చేసేది లేక అప్పులు చేసి, వ్యవసాయం చేసుకుంటున్నాడు. అయితే చుక్కల భూములకు పరిష్కారం లభించడంతో హక్కు పత్రాలను అందుకుని, ఎన్నో ఏళ్లుగా ఉన్న సమస్యను పరిష్కరించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని చెబుతున్నాడు.



చుక్కల భూమి.. చక్కని పరిష్కారం

భూమి వారిదే.. పట్టాదారు పాసు పుస్తకం జారీ కాదు.. బ్యాంకు రుణం రాదు.. ప్రైవేటు అప్పు పుట్టదు.. క్రయ, విక్రయాలు కుదరవు.. మరొకరి పేరుతో మారదు.. దశాబ్దాలుగా బాధిస్తున్న సమస్యకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఒక సంతకంతో పరిష్కారం చూపారు.. ఫలితంగా ఆ భూములు నిషేధిత జాబితా నుంచి తొలగాయి. సన్న, చిన్నకారు రైతులతోపాటు బడా రైతుల బాధలు తీరాయి. చుక్కల భూములకు చక్కని పరిష్కారం లభించింది. – చిల్లకూరు

- బ్రిటీష్ కాలం నాటి సమస్యకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో పరిష్కారం
- జిల్లాలో తొలిసారిగా గూడూరు నియోజకవర్గంలో..
- 1,847 మంది రైతులకు తొలగిన ఇక్కట్లు


నిషేధిత జాబితా నుంచి తొలగించిన భూముల వివరాలను జిల్లా రిజిస్ట్రార్‌కు అందజేస్తున్న ప్రజా ప్రతినిధులు, రెవెన్యూ అధికారులు (ఫైల్)

రైతు బాంధవుడిగా నిలుస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చారిత్రాత్మక నిర్ణయాలు రైతులకు లబ్ధి చేకూరుస్తున్నాయి. బ్రిటీష్‌కాలం నాటి సమస్యలకు గత నెల 12వ తేదీన నెల్లూరుజిల్లా కావలిలో ఒక సంతకంతో పరిష్కారం చూపారు. దీంతో నేడు రైతులు తమ భూములపై హక్కులు సాధించుకున్నామనే సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తిరుపతి జిల్లాలో కూడా ఎంతో మంది రైతులు చుక్కల భూముల సమస్యలతో క్రయ, విక్రయాలు చేసుకోలేక, పట్టాదారుల పాస్ పుస్తకాలు పొందలేక ఇక్కట్లు పడుతున్నారు. కలెక్టర్ ఆదేశాలతో గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్ చొరవ తీసుకుని నియోజకవర్గంలోని అన్ని మండలాల తహసీల్దార్లను సంసిద్ధం చేసి, తొలి విడతలో 1,847 మంది రైతులకు చెందిన భూములు 3755.79 ఎకరాలను నిషేధిత జాబితా నుంచి తొలగించారు. ఆపై వారికి హక్కు పత్రాలను జిల్లాలోనే తొలిసారిగా ప్రజాప్రతినిధుల చేతులు మీదుగా అందించి సీఎం ఆశయాన్ని కొనసాగిస్తున్నారు.

మండలాలు	రెవెన్యూ గ్రామాలు	రైతులు సంఖ్య	విస్తీర్ణం (ఎకరాల్లో)
గూడూరు	7	728	1321.30
చిల్లకూరు	13	633	1583.58
కోట	3	170	261.73
వాకాడు	2	292	367.63
చిట్టమూరు	1	24	221.55

చుక్కల భూములంటే ఏమిటి..

బ్రిటీష్ పాలకులు 1905లో ఆదాయ మార్గాల అన్వేషణలో భాగంగా భూమి శిస్తు వసూలు చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో గ్రామాల్లో దండోరా వేయించి భూమి సాగు చేసుకునే వారు, వారి భూమి వద్ద ఉండాలన్నారు. అయితే కొంత మంది ఆ సమయంలో హాజరు కాలేక పోవడంతో వారి భూములపై చుక్కలు పెట్టారు. దీనినే అప్పటి ఐసీఎస్ అధికారులు సర్వే పూర్తి చేసి డైగ్లాట్, ఆర్ఎస్ఆర్‌లలో చుక్కల భూములుగా నమోదు చేశారు. అప్పటి నుంచి అవి నిషేధిత భూములగానే ఉండి పోయాయి.

వేగవంతంగా పరిష్కారం



పేదలకు న్యాయం చేసే విషయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయం మేరకు చుక్కల భూముల సమస్యలను వేగవంతంగా పరిష్కరిస్తున్నాం. తొలి విడతగా ఐదు మండలాల్లో 3755.79 ఎకరాలను నిషేధిత జాబితా నుంచి తొలగించి, రైతులకు హక్కు పత్రాలను అందించాం.

– కిరణ్‌కుమార్, ఆర్డీఓ, గూడూరు



బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.60,270
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,413
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.70,300
రిటైల్ వెండి గ్రాము	రూ.73.30

నేడు కేంద్ర మంత్రి పర్యటన

చిల్లకూరు: మండలంలో సోమవారం కేంద్ర ఐటీ శాఖా సహాయ మంత్రి దేవ్ సింగ్ సెహ్వాగ్ పర్యటించనున్నట్లు ఎంపీడీఓ గోపీనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే ఉపాధి పనులు ఎలా అమలవుతున్నాయనే విషయాలపై ఆరా తీసే క్రమంలో పర్యటించనున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో మండలంలోని పారిచెర్లవారిపాళెంలో జరిగే ఉపాధి పనులను పరిశీలించి, అక్కడ కూలీలతో మాట్లాడతారన్నారు. అలాగే ఎంత మేరకు కూలీ నగదు చెల్లింపులు జరుగుతున్నాయి, ఎలాంటి పనులు నిర్వహణ జరుగుతుందన్న విషయంపై అధికారుల ద్వారా తెలుసుకుంటారని చెప్పారు.

చిత్తూరులో వివాహిత ఆత్మహత్య

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో ప్రియ (37) అనే వివాహిత ఆదివారం ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. తమిళనాడుకు చెందిన ప్రియకు, చిత్తూరుకు చెందిన వినోద్‌కుమార్‌కు దాదాపు పదేళ్ల క్రితం వివాహమైంది. వినోద్ కుమార్ చిత్తూరు నగరంలోని స్టాంపులు, రిజిస్ట్రేషన్‌శాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. దంపతుల మధ్య చిన్నపాటి మనస్పర్థలు రావడంతో చీరతో ఇంట్లోని పైకప్పుకు ఉరేసుకుని ప్రియ ఆత్మహత్య చేసుకుంది. టూటౌన్ సీఐ మద్దయ్య ఆచారి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

తిరుమూరులో జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నీ ప్రారంభం


వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

వాకాడు: మండలంలోని తిరుమూరులో ఆదివారం జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభమైంది. నిర్వాహకులు మాట్లాడుతూ గ్రామానికి చెందిన టీఎంఆర్ యూత్ ఆధ్వర్యంలో ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా నలు మూలల నుంచి క్రీడాకారులు తరలివచ్చి, టోర్నమెంట్‌లో పాల్గొన్నారన్నారు. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.20,116, రెండో బహుమతిగా రూ.15,116, మూడో బహుమతిగా రూ.7116 నగదు అందజేస్తామని చెప్పారు. ఈ టోర్నమెంట్‌ను గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు పి కృష్ణారెడ్డి, జి రామచంద్రారెడ్డితోపాటు, గ్రామంలోని మరో యువకుడు కుంచం పవన్ సహకారంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

అలరించిన దుర్యోధన వధ

రామచంద్రాపురం: మండలంలోని రామాపురంలోని శ్రీ కృష్ణ, ధర్మరాజులు, ద్రౌపదిదేవి ఆలయంలో మహాభారత ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం నిర్వహించిన దుర్యోధనుని వధ ఘట్టం అలరించింది. మధ్యాహ్నం భాగవతారిణి నాగరత్న దుర్యోధనుని వధ హరికథా గానం చేశారు. భక్తుల గోవిందనామ స్మరణల నడుమ అమ్మవారి అగ్నిగుండ ప్రవేశాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మధ్యాహ్నం, రాత్రి అన్నదానం చేశారు.

ద్రౌపది అమ్మవారికి సారె సమర్పణ


సారె తీసుకువెళ్తున్న డాలర్ దివాకర్‌రెడ్డి

రామచంద్రాపురం మండలంలోని సీరామాపురంలో జరుగుతున్న మహాభారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ద్రౌపదీ అమ్మవారికి డాలర్స్ గ్రూప్ అధినేత డాలర్ దివాకర్‌రెడ్డి సారె సమర్పించారు. ఆయన గంగమ్మ ఆలయం నుంచి ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. సర్పంచ్ సుబ్రమణ్యంరెడ్డి, ఉత్సవ నిర్వాహకులు పవన్‌కుమార్‌రెడ్డి, నరసింహారెడ్డి, రామిరెడ్డి ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ పూజారి మురగయ్య అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, దర్శనభాగ్యం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఏడుగురు పేకాటరాయుళ్ల అరెస్టు


జూదరుల అరెస్టు చూపుతున్న ఎస్‌ఐ నాగార్జునరెడ్డి

వరదయ్యపాళెం: మండలంలోని గోపాలరావుకాలనీ సమీపంలో పేకాట ఆడుతున్న ఏడుగురు జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ నాగార్జునరెడ్డి తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు.. ముందస్తు సమాచారంతో ఎస్‌ఐ తన సిబ్బందితో కలసి గోపాలరావు కాలనీ సమీపంలో పేకాట స్థావరంపై ఆదివారం దాడులు చేశారు. అక్కడ పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ. 6,270 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. పట్టుబడిన వారిలో వరదయ్యపాళేనికి చెందిన పి.మనోహర్ నాయుడు, శాటిలైట్ కాలనీకి చెందిన నాగయ్య, సురేష్, రమణయ్య, వరదయ్యపాళెం దళితవాడకు చెందిన రవి, చిన్న పిచ్చయ్య, వి.మనోహర్ ఉన్నారని చెప్పారు. ఈ దాడుల్లో ఏఎస్‌ఐ షణ్ముగం, సిబ్బంది హరి, కిరణ్, సుధీర్, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

లేక్ వ్యాలీ రిసార్ట్ ప్రారంభం


జ్యోతి వెలిగించి రిసార్ట్‌ను ప్రారంభిస్తున్న మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, బొత్సా సత్యనారాయణ

భాకరాపేట: మంచి వాతావరణంలో నిర్మించిన లేక్ వ్యాలీ రిసార్ట్‌కు వచ్చే వారికి ఆహ్లాదం, ఆనందాన్ని అందిస్తుందని రాష్ట్ర మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, బొత్సా సత్యనారాయణ పేర్కొన్నారు. చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేట ఘాట్ రోడ్డు సమీపంలోని అటవీ సరిహద్దుల్లో ప్రత్యేక అంగులతో నిర్మించిన లేక్ వ్యాలీ రిసార్ట్‌ను ఆదివారం మధ్యాహ్నం మంత్రులు ప్రారంభించారు. అనంతరం కన్వెన్షన్ హాల్, రిసార్ట్స్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకృతి సిద్ధమైన వాతావరణంలో నిర్మించడంతో తలకోనకు వచ్చే పర్యాటకులతో పాటు, సినీ రంగాన్ని కూడా ఆకర్షించేలా ఉందని మంత్రులు పేర్కొన్నారు. రిసార్ట్స్ నిర్వాహకుడు సుబ్రమణ్యంరెడ్డి ఈ రంగంలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, పీలేరు మాజీ ఎమ్మెల్యే జీ.వి.శ్రీనాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఎమ్మార్సీరెడ్డి, పుంగనూరు నేత కొండవీటి నాగభూషణం, డీసీఎంఎస్ చైర్మన్ సహదేవరెడ్డి, ఎంపీపీ యుగంధర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చేనేతకు పూర్వవైభవం తీసుకొస్తాం


మాట్లాడుతున్న కేంద్రమంత్రి దేవ్‌సిన్హా చౌహాన్

వెంకటగిరి: చేనేత రంగానికి మరిన్ని ప్రోత్సహకాలు ఇచ్చి, పూర్వవైభవం తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని కేంద్రమంత్రి దేవ్‌సిన్హా చౌహాన్ తెలిపారు. స్థానిక పద్మశాలి కల్యాణ మండపంలో ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన చేనేత సమ్మేళనం కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవర్‌లూమ్ రాకతో చేనేత పరిశ్రమకు కష్టకాలం వచ్చిందన్నారు. నిర్దేశించిన చేనేత ఉత్పత్తులను పవర్‌లూమ్‌పై తయారు కాకుండా పటిష్ట చర్యలు తీసుకుంటామని చెప్పారు. జరీ, నూలు, వంటి ముడిసరుకులను 90 శాతం సబ్సిడీతో అందించేలా కృషి చేస్తామని తెలిపారు. చేనేత ఉత్పత్తులపై జీఎస్టీ భారాన్ని తగ్గించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళతానని చెప్పారు. అనంతరం ఆయన స్థానిక వివేకానంద యువ సైన్యం కోఆర్డినేటర్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కేజీ ప్రకృతికుమార్ నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎస్ఎస్ఆర్ నాయుడు, నాయకులు శ్రావణకుమార్, వి భాస్కర్, ఈ యోగీశ్వరరావు, గురుప్రసాద్ పాల్గొన్నారు.

తీర ప్రాంతాల్లో టూరిజం అభివృద్ధిపై సర్వే


వాటంబేడు కుప్పంలో పులికాట్ తీరం వద్ద అధ్యయన బృందం

తడ: తీర ప్రాంతాల్లో టూరిజం అభివృద్ధి ఉన్న అవకాశాలను పరిశీలించేందుకు అటవీశాఖకు చెందిన అధ్యయన బృందం ఆదివారం రామాపురం నుంచి వాటంబేడు వరకు సర్వే చేసింది. టూరిజం అధికారి శ్రీనివాసులు, మత్స్య కళాశాలకు చెందిన ప్రొఫెసర్ డాక్టర్ అనుప, కోట ఎఫ్‌డీఓ రెడ్డినాయక్, స్థానిక పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో కలసి సర్వే చేశారు. తీర ప్రాంతాల్లో టూరిజం అభివృద్ధి జరిగితే చుట్టు పక్కల ప్రాంతాలు అభివృద్ధి చెందడంతోపాటు స్థానికులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయనే ఉద్దేశంతో ప్రభుత్వం దీనిపై దృష్టి సారించిందని టూరిజం అధికారి శ్రీనివాస్ తెలిపారు. జాలర్ల కుప్పాల్లో పర్యటించిన ఈ బృందానికి స్థానిక జాలర్ల సంఘాల నాయకులు తడలో కే ఆర్ముగం, వాటంబేడులో బీ వరప్రసాద్ సహకారం అందజేశారు.

ఒంటరి ఏనుగు సంచారం


ఏనుగుదాడిలో గాయపడిన పాడిఆవు

వి.కోట: మండలంలోని గోనుమాకులపల్లి అటవీ సరిహద్దు పొలాల్లో ఒంటరి ఏనుగు హల్‌చల్ చేసింది. ఆదివారం మండలంలోని వి.కోట–పలమనేరు జాతీయ రహదారిలో కుమ్మరమడుగు వద్ద రోడ్డు దాటుతుండగా అక్కడి ప్రజలు గమనించారు. వారు గట్టిగా కేకలు పెట్టడంతో అటవీ ప్రాంతంలోకి వెళ్లి పోయింది. గ్రామ సమీపంలోనే ఒంటరి ఏనుగు సంచరించడంతో గ్రామస్తులు బిక్కుబిక్కు మంటున్నారు. అలాగే శనివారం రాత్రి గోనుమాకులపల్లె గ్రామానికి చెందిన రైతు రఘుపతికి చెందిన పొలాలపై విరుచుకుపడి బీన్స్ పంటను తొక్కి నాశనం చేసింది. అంతేగాక పొలం వద్ద కట్టేసిన పాడి ఆవుపై దాడి చేసి తొక్కి కాలు విరిచేసింది. పందిరిని ధ్వంసం చేసింది.